RNI NO.APTEL/2006/18110

## 'టెట్' లేకుండా టీచర్లను నియమించొద్దు: సుప్రీంకోర్టు

ఢిల్లీ: అర్హత లేని టీచర్లతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, 'టెట్' లాంటి నిర్దేశిత అర్హతలు లేని ఉపాధ్యాయులను నియమించొద్దని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం పేర్కొంది. అర్హత లేని టీచర్ల నియామకంపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. అస్సాం టీచర్ రిక్రూట్మెంట్ కేసులో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. టీచర్ల రిక్రూట్మెంట్‌పై సమీక్ష చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

## కేసీఆర్‌ను ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు: జగదీశ్ రెడ్డి

తాము బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తున్న క్రమశిక్షణ కలిగిన సైనికులమని... కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత చర్యలకు, పోలీసుల అక్రమ అరెస్టులకు తాము ఏమాత్రం భయపడేది లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ దారుణాలను, వైఫల్యాలను ప్రజల కళ్లకు కట్టినట్లు ఎండగడుతుంటే తట్టుకోలేకనే ప్రతిపక్షంపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ నడుస్తుండగా ప్రభుత్వ విప్‌లు, అధికార పార్టీ ఎమ్మెల్యేలను డప్పులు కొట్టుకుంటూ కేసీఆర్ ఫాంహౌస్ వైపు పంపడం ఏ రకమైన సంస్కారమని జగదీశ్ రెడ్డి నిలదీశారు.

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 291 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ బుధవారం 9 - 9 - 2026 పేజీలు : 4 వెల : రూ. 1 - 00

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకునే ఆలోచన మాకు లేదు: స్పీకర్

హైదరాబాద్, సెప్టెంబర్ 8 : తాను ప్రజాస్వామిక పద్ధతిలో సభ నడుపుతున్నానని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వ్యాఖ్యానించారు. నిన్నటి సంఘటనతో తాను బీఆర్ఎస్ నేతలకు మైక్ ఇవ్వనని స్పష్టం చేశారు. ఈరోజు (మంగళవారం) తనకు బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెబుతారని అనుకున్నానని అన్నారు. ఇవాళ అసెంబ్లీలో స్పీకర్ మాట్లాడారు. తనకు క్షమాపణ చెప్పకపోగా బీఆర్ఎస్ సభ్యులు సభను డైవర్షన్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాను మొదటిసారి బీఆర్ఎస్ సభ్యులపై కోప్పడుతున్నానని తెలిపారు. తనను ఎవరూ ఎప్పుడూ ఏం అనలేదని అన్నారు. తానెప్పుడు మీడియా ముందుకు రాలేదని తెలిపారు.ఇలాంటి సంఘటనలు తనకు ఎప్పుడూ ఎదురుకాలేదని స్పీకర్ గడ్డం ప్రసాద్ వ్యాఖ్యానించారు. 'నేను చాలా భావోద్వేగంతో ఉన్నాను. ఈరోజు సభను నడిపించలేకపోతున్నా. ప్యానెల్ స్పీకర్‌ను పెట్టి సభ నడిపించాలని కోరాను. మాజీ సీఎం కేసీఆర్ స్వయంగా వచ్చి క్షమాపణ చెప్పాలి. కేసీఆర్ సభకు రావాలి. ప్రతిసారి సభకు ముందు కేసీఆర్‌కి కాల్ చేస్తాను. నా ఆరోగ్యం సహకరిస్తే వస్తానని కేసీఆర్ చెప్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు సభలో సభ్యుడు




కాకపోయినా చర్యలు తీసుకునే అధికారం ఉంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకునే ఆలోచన మాకు లేదు. జరిగిన పరిణామాల పట్ల చింతిస్తున్నాను. ప్యానల్ స్పీకర్‌గా కడియం శ్రీహరిని కూర్చోబెడుతున్నాం. తాతా మధు వ్యాఖ్యలతో ఈ రోజు చైర్ లో కూర్చోవాలని లేదు' అని స్పీకర్ గడ్డం ప్రసాద్ పేర్కొన్నారు.

## 'నా తల్లిని అన్నారు.. ముందు నా సంగతేంటో చెప్పాలి': స్పీకర్

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మాజీ మంత్రి హరీశ్ రావు మధ్య మాటల యుద్ధం

హైదరాబాద్, సెప్టెంబర్ 8: తెలంగాణ అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మాజీ మంత్రి హరీశ్ రావు మధ్య మాటల యుద్ధం నడిచింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై స్పీకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు తీరుపై మండిపడ్డారు. 'నా తల్లిని అన్నారు.. నాకు ఆగ్రహం ఉంటుంది. నీ తల్లిని అనలేదు. నీకెందుకు ఆగ్రహం' అంటూ ఫైర్ అయ్యారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రా రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తన సోదరీమణులతో సమానమని తెలిపారు. వారిపై దాడి జరిగిందని తెలియగానే నివేదిక కోరినట్లు స్పీకర్ చెప్పారు. నివేదిక వచ్చాక చర్యలు తప్పక తీసుకుంటామన్నారు. కానీ ముందు తన సంగతేంటో చెప్పాలని.. 'నా తల్లిని అన్నారు.. హరీశ్ రావు ముందు దీనిపై మాట్లాడాలి' అంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సీరియస్ అయ్యారు.అంతకుముం దు హరీశ్ రావు మాట్లాడుతూ.. నిన్న అసెంబ్లీ గేటు వద్ద మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై దాడి జరిగిందని సబిత గొంతు నులిమారని, సునీత చీర లాగారని ఫైర్ అయ్యారు. దాడి జరిగిన వారిపైనే తిరిగి కేసులు నమోదు చేశారని.. తమకు న్యాయం చేయాలని



హరీశ్ డిమాండ్ చేశారు. దీనిపైనే స్పీకర్ మాట్లాడుతూ.. హరీశ్ రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకంత సీరియస్ అవుతున్నారని ప్రశ్నిస్తూ.. 'నా తల్లిని అన్నారు.. నీ తల్లిని అనలేదు.. నాకు ఉంటుంది ఆగ్రహం' అంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఫైర్ అయ్యారు.

## ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు రంగం సిద్ధం.. అసెంబ్లీలో తీర్మానం పెట్టిన మంత్రి దామోదర

**హైదరాబాద్,సెప్టెంబర్,08:** తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు, అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై అధికార పక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలనే బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు నవీన్ కుమార్ రెడ్డి పై సభ తరఫున కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ2 మంత్రి దామోదర రాజనర్సింహ కీలక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ సభ్యులు, నేతలు వ్యవహరించిన తీరుపై విపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఈ తీర్మానంలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సభలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. ఎస్సీల చరిత్ర అనేది కేవలం ఒక వర్గానికి సంబంధించినది కాదని, అది జాతి ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, కానీ రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలను, అత్యున్నత పదవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్పీకర్ స్థానం ఏ ఒక్క కులానికో, మతానికో చెందింది కాదని, అలాంటి పీఠంపై కూర్చున్న వ్యక్తిని అవమానించడం క్షమించరాని నేరమని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల అహంకారం మాత్రం తగ్గలేదని ధ్వజమెత్తుతూ, ప్రజా జీవితంలో ఉన్నవారు ఎంతో బాధ్యతగా నడుచుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా మంత్రి దామోదర ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి



విక్రమార్క పూర్తిగా బలపరుస్తూ సభలో మాట్లాడారు.. రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం తరఫున కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. అనంతరం సభ తీర్మానానికి ఏకగ్రీవంగా ఆమోదం తెలపింది. దీంతో ఎమ్మెల్సీలపై చర్యలకు సంబంధించిన అధికారిక తీర్మానం కాపీని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపనున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ఎమ్మెల్సీలపై మండలి వేదికగా కఠిన చర్యలు ఉండే అవకాశం ఉంది.

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది 'కాంప్రమైజ్ పాలిటిక్స్'

### : కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్

తెలంగాణ శాసనసభ సమావేశాల తీరు, అధికార కాంగ్రెస్ , ప్రధాన ప్రతిపక్షంబీ పార్టీల వ్యవహార శైలిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇవాళ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇరు పార్టీలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి రాజకీయ డ్రామాలతో ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. అసెంబ్లీలో జరుగుతున్న పరిణామాలను చూసి రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారని, నేతల బజారు భాష చూసి నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 'నువ్వు కొట్టినట్లు చేయ్.. నేను ఏడ్చినట్లు చేస్తా' అన్న చందంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు లాలూచీ రాజకీయాలు చేస్తూ ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. స్పీకర్‌పై బీఆర్ఎస్ నేతలు అసభ్య పదజాలంతో దూషించడాన్ని ప్రజాస్వామ్యవాదులెవరూ జీర్ణించుకోలేరని స్పష్టం చేశారు. తాతా మధుతో పాటు విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై చేయి చేసుకున్న బీఆర్ఎస్ నేతలను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కలుగులో దాక్కున్నారని, అసెంబ్లీకే రానప్పుడు ఆయనకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఎందుకని నిలదీశారు. రాష్ట్రంలో 22ఎ నిషేధిత భూముల సమస్యతో ప్రజలు అల్లాడిపోతుంటే, మంత్రులు, అధికార పార్టీ నేతలు వేల కోట్ల రూపాయల భూదందాలకు పాల్పడుతున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాక, సర్టిఫికెట్లు అందక లక్షలాది మంది విద్యార్థులు అరిగోస పడుతున్నారని అన్నారు. సాగునీరు లేక దక్షిణ తెలంగాణ రైతాంగం ఆందోళనలో ఉందని, ఉద్యోగాలు లేక



నిరుద్యోగులు, డీఏలు–పెండింగ్ బిల్లులు రాక ఉద్యోగులు, ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరు గ్యారెంటీల అమలు ఊసేలేదని.. ఇక రెండు రోజుల పాటు ఒకే అంశంపై చర్చించి విలువైన సభా సమయాన్ని వృథా చేయడం దుర్మార్గమని విమర్శించారు. గాయాలని డ్రామాలు..ఇక ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన బీజేపీ కార్యకర్తలపై పోలీసులు రక్తం కారేలా లాఠీచార్జ్ చేయడం దారణమని బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ నేతలకు ఎలాంటి దెబ్బలు తగలకపోయినా ఏదో జరిగిపోయినట్లుగా డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందేనని, రెండు పార్టీలు కలిసి ప్రజలను దోచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా డైవర్షన్ రాజకీయాలు, డ్రామాలు కట్టిపెట్టి అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు చూపాలని బండి సంజయ్ హితవు పలికారు.

## రేవంత్ రెడ్డిని ఇంటికి పంపడమే మా లక్ష్యం.. తాత మధు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్,సెప్టెంబర్,08:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమారెడ్డి రిమాండ్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించడంపై వారు స్పందించారు. రేవంత్ రెడ్డి తమను అక్రమ కేసుల్లో జైలుకు పంపాలని చూస్తే అంతిమంగా న్యాయమే గెలుస్తుందని కోర్టు నిరూపించిందని తాతా మధు అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికుట్రలు చేసినా, ఎన్ని కుతంత్రాలు చేసినా కోర్టు తమవైపు న్యాయం ఉందని నమ్మిందన్నారు. నవీన్ రెడ్డిని, తనను ఉదయం నుండి కనీసం స్నానం చేయకుండా అరెస్ట్ చేసి వేధించారని చెప్పారు. తమకు అండగా ఉన్న కేసీఆర్ కు , బీఆర్ఎస్ పార్టీకి, వాదనలు వినిపించిన న్యాయవాదులకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ పోరాటం కొనసాగుతుందని, మళ్లీ బీఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని చెప్పారు. రేవంత్ రెడ్డిని ఇంటికి పంపించడమే తమ లక్ష్యం అని అన్నారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. తనను, తాతా మధును



టార్గెట్ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తాము ఏ తప్పు చేయలేదు కాబట్టే రిమాండ్ రిజెక్ట్ అయిందని చెప్పారు. కోర్టు తీర్పు రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టని వ్యాఖ్యానించారు.

## ఫలించిన కాంగ్రెస్ పోరాటం.. ఖర్గే ర్యాలీ తర్వాత శుద్ధి చేసిన ఘటనపై ఎఫ్ఐఆర్

ఎట్టకేలకు కాంగ్రెస్ పోరాటం ఫలించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ర్యాలీ తర్వాత ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో శుద్ధి చేశారన్న ఘటన దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఈ వ్యవహారంపై రాజ్యసభలో కూడా ఖర్గే ప్రస్తావించారు. ఇక లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా తీవ్రంగా తప్పుపట్టారు. వెంటనే ఎఫ్ఐఆర్ బుక్ చేయాలని డిమాండ్ చేశారు. మొత్తానికి ఇన్ని రోజుల తర్వాత పోలీసులు కేసు నమోదు చేశారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ర్యాలీ అనంతరం హల్ద్వానీలోని రామ్‌లీలా మైదాన్‌లో జరిగినట్లు ఆరోపించబడిన ఒక శుద్ధీకరణ కార్యక్రమానికి సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదైంది. న్యాయవాది అంజు దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా హల్ద్వానీ పోలీస్ స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులపై ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిపై కుల వివక్ష, సామాజిక అవమానం, ద్వేషాన్ని, న్యూనతా భావాన్ని రెచ్చగొట్టడం వంటి ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఐపీసీలోని సెక్షన్లు 196, 299, 3(1)ఆర్, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద ఈ కేసు నమోదు చేశారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, డాక్టర్ జగదీష్ చంద్ర, ఈ మొత్తం వ్యవహారాన్ని దర్యాప్తు చేయనున్నారు. ఇదిలా ఉండగా 'శుద్ధీకరణ' కేసు విషయంలో కాంగ్రెస్ అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆరోపిస్తూ బీజేపీ షెడ్యూల్డ్ కులాల ఫ్రంట్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రాష్ట్రవ్యాప్త నిరసన చేపట్టింది. అయితే ఈ విషయమై పోలీసులు ఇప్పుడు కేసు నమోదు చేశారు.



## ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

### తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ నిరసన




హైదరాబాద్,సెప్టెంబర్,8:

మంగళవారం మాసబ్ ట్యాంక్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ (టీఈజీజేఏసీ) విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా ౧+ూం అధ్యక్షులు కృష్ణాయాదవ్ మాట్లాడుతూ, ఈ నెల 10వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని సంఘం నాయకులు గందూరి వెంకట్, నాగులపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. అందుకోసం అన్నిశాఖల ఉద్యోగులతో సన్నాహక సమావేశాలు, నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. మండల, డివిజన్, జిల్లా కేంద్ర కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో ఈ నిరసనలు రాష్ట్రమంతటా నిర్వహిస్తున్నట్లు టీఈజీజేఏసీ ప్రకటించింది. ప్రధానంగా పి.ఆర్.సి., పెండింగ్ డి.ఎ.లు, పదోన్నతులు, హెచ్.ఓ.డి. కార్యాలయాలలో 12.5 శాతం కోటా, మొదలగునవి వెంటనే పరిష్కరించాలని సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో **TNGOs Hyd** సెంట్రల్ యూనియన్ నుండి వెంకట్, **TEGJAC Member & I&PR** ఫోరం అధ్యక్షులు నాగులపల్లి వెంకటేశ్వర రావు, **TGOs** ఫోరం జాయింట్ సెక్రటరీ వనజ, **TNGOs I&PR** ఫోరం అధ్యక్షులు జితేందర్, తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఒకప్పుడు అప్రతిహతం.. నేడు హతం!

దేశంలో కమ్యూనిజం సిద్ధాంతాలను బలోపేతం చేసిన కమ్యూనిస్టు పార్టీలు.. తాజా ఎన్నికలతో కనుమరుగయ్యాయి. ప్రజా పాలనలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన సీపీఐ, సీపీఎం పార్టీలు.. పలు రాష్ట్రాల్లో అధికారం చలాయించాయి. అయితే.. ఒక్కొక్క దశలో ఎదురైన అనేక సంఘర్షణల కారణంగా కాలానికి అనుగుణంగా దూసుకుపోయే తత్వాన్ని అలవరుచుకోని కామ్రెడ్లు.. ప్రజా క్షేత్రంలో తమను తామే ఓడించుకుని.. అధికారానికి దూరమయ్యారు. తాజాగా కేరళలో ఎల్‌డీఎఫ్ కూటమి సైతం ఓటమి పాలవడంతో దేశంలో ఎక్కడా కమ్యూనిస్టుల ప్రభుత్వం లేకుండా పోయింది. మొత్తం 36 రాష్ట్రాల్లో ఎక్కడా కమ్యూనిజం ప్రభావం కూడా కనిపించకపోవడం గమనార్హం. 1980వ దశకంలో, సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష పార్టీలు కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లను ఏకకాలంలో పాలించాయి. లోక్‌సభలోనూ సత్తా చాటాయి. 2004లో 60కి పైగా సీట్లు గెలుచుకుని అత్యున్నత స్థాయికి చేరుకున్నాయి. భారత్–అమెరికా అణు ఒప్పందంపై లోక్‌సభలో దాదాపు 60 మంది ఎంపీలు ఉన్న వామపక్ష కూటమి మద్దతు ఉపసంహరించుకోవడంతో, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం బలపరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. ఇది అప్పట్లో పెను సంచలనంగా మారింది.పశ్చిమ బెంగాల్‌లో 1977 నుండి 2011 వరకు వామపక్ష కూటమి అధికారంలో ఉంది. ఈశాన్య రాష్ట్రం త్రిపురను 1993 నుండి 2018 వరకు పాలించింది. ఇక, కేరళలో ప్రతి ఐదేళ్లగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ తాజా ఎన్నికల్లో అధికారం కోల్పోయింది. 1977లో పశ్చిమ బెంగాల్‌లో సీపీఐ(ఎం) అధికారంలోకి వచ్చింది. తద్వారా ఏ రాష్ట్రంలోనైనా ఏ పార్టీకి దక్కని సుదీర్ఘ నిరంతర పాలనకు నాంది పలికింది. జ్యోతి బసు 23 సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2000లో బుద్ధదేబ్ భట్టాచార్య సీఎం అయ్యారు. ఆ తర్వాత వామపక్షాలు మరో 11 సంవత్సరాల పాటు బెంగాల్‌ను పాలించాయి. ఈశాన్య రాష్ట్రం త్రిపురలో 1993 నుండి 2018 వరకు వామపక్షాలు అధికారం దక్కించుకున్నాయి. 1993లో రాష్ట్రంలో వామపక్షాలు ఘనవిజయం సాధించాయి. అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను సీపీఐ(ఎం) ఒక్కటే 44 స్థానాలను గెలుచుకుంది. 1998 వరకు దశరథ్ దేబ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత మాణిక్ సర్కార్ బాధ్యతలు స్వీకరించి 20 సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగారు. త్రిపురలో 25 ఏళ్ల వామపక్ష కూటమి పాలన 2018లో బీజేపీ అనూహ్యంగా ఓడించడంతో ముగిసింది. 2023లో బీజేపీ విజయాన్ని పునరావృతం చేసింది.కేరళలో సీపీఐ(ఎం) పేలవమైన ప్రదర్శనతో వామపక్షాల చివరి కంచుకోట కూలిపోయింది. ప్రస్తుత ఓట్ల లెక్కింపు సరళి ప్రకారం, ఈ దక్షిణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సునాయాసమైన ఆధిక్యాన్ని సాధించింది. 2016లో అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ నేతృత్వంలోని సీపీఐ(ఎం) లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం అధికారం నుంచి దిగిపోయింది. 1977 తర్వాత తొలిసారిగా భారతదేశంలో కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రి లేక పోవడం గమనార్హం. మరో వైపు దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకుల ఉద్యమా లకు పెట్టింది పేరుగా ఈ పార్టి ప్రాభవం దక్కించుకుంది. గత వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్ర మహోన్నతమైనది. రష్యా అక్టోబర్ విప్లవ ప్రభావంతోనే ఇండియాలో కూడా 1925లోనే రాడికల్ హ్యూమనిస్టు యంయన్.రాయ్, దత్,యస్ఏ డాంగే, తదితర కార్మిక నేతల నేతృత్వంలో "కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా" సీపీఐ కి అంకురార్పణ జరిగింది. ఆనాటి బ్రిటిష్ వలసవాదులు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో అప్పట్లో రహస్యంగా పనిచేయవలసి వచ్చింది. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు ఎన్నెన్నో ఉద్యమాలు చేసారు. గ్రామీణ రైతాంగ ఉద్యమాలు మొదలు, పట్టణ పారిశ్రామిక కార్మికుల ఉద్యమాలు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు , ఉపాధ్యాయ, బ్యాంకు, రైల్వే, ఆర్టీసీ , ఎలక్ట్రిసిటీ , టెలిఫోన్, ప్రభుత్వ ఉద్యోగులైతేనేమి, బీడీ కార్మికులు, పారిశుధ్య కార్మికులైతేనేమి, ఇళ్ల స్థలాల ఉద్యమాలైతే నేమి , జీతాలు, కూలీలు, బోనసులు, పని పరిస్థితుల మెరుగుదల మొదలైన వన్నీ కోట్లాది ప్రజలకు అందిన మేరకు అవన్నీ కమ్యూనిస్టు ఉద్యమాల ఫలితాలే. లక్షలాది కమ్యూనిస్టు కార్యకర్తల , నాయకుల త్యాగాల ఫలితమే నేడు అమలులో ఉన్న ప్రావిడెంటు ఫండ్ , పెన్షన్, సెలవులు, 8 గంటల పని, తదితర సౌకర్యాలు. ఆదివాసీ గిరిజనులకు,పేదలకు కొన్నయినా భూములు దక్కాయంటే కమ్యూనిస్టులు, నక్సలైట్లు, మావోయిస్టులు, వేలాది మంది ప్రాణ త్యాగాలతో సాధించి పెట్టినవే. ఇంతటి మహత్తర ఉద్యమాల చరిత్ర వేల వేల పేజీలు వేలాది పుస్తకాలుగా డాక్యుమెంట్లుగా రికార్డయి వున్నాయి.నిజానికి కాంగ్రెస్ పార్టీ గురించి చాలా మంది చర్చిస్తారు. కానీ, కాంగ్రెస్ కంటే కూడా ముందుగానే గ్రామాల్లో పరిఢవిల్లిన పార్టీ సీపీఐ అంటే ఆశ్చర్యం వేస్తుంది. ఏ గ్రామానికి వెళ్లినా.. నాలుగు రోడ్ల కూడలిలో ఎర్ర జెండా ఎగరేసే దిమ్మెలు దర్శనమిస్తాయి.కనీసంలో కనీసం పది మంది అయినా.. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో కనిపిస్తారు. అలా ఒకప్పుడు ప్రాభవాన్ని సంతరించుకున్న పార్టీ, పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర తదితర రాష్ట్రాల్లో అధికారంలోకి కూడా వచ్చింది. నైజాం రాజరికం ఉన్న తెలంగాణ రాష్ట్రం లో భూస్వామ్య శృంఖలాలు తెంచడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైనది.ఆంధ్రమహాసభ కార్యక్రమం లో రహస్యంగా ప్రవేశించి గ్రంథాలయ ఉద్యమం,రాత్రి బడులు లాంటి చిన్న చిన్న సంస్కరణలు ద్వారా రైతాంగ ఉద్యమానికి పునాదులు వేసింది.చివరకు అది 'తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం' గా మారి ఐదు లక్షల గ్రామాలకు ఎర్రజెండా విస్తరించింది."దున్నే వానికే భూమి"కీలక నినాదం ను ముందుకు తేవడం ద్వారా దేశంలో భూసంస్కరణలు అమలు జరపడానికి కమ్యూనిస్టుల పోరాటమే మూలం.సైద్ధాంతిక గందరగోళం మధ్య సరైన పంథాలో పయనం సాగించలేకపోయిన భారత కమ్యూనిస్ట్ పార్టీ 1964లో రెండుగా చీలింది. సీపీఐ నుంచి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) సీపీఎం పార్టీ అవతరించింది. సీపీఐకి చంద్ర రాజేశ్వరరా వు, నల్లమల్ల గిరి ప్రసాద్, సీపీఎంనకు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య లాంటి దిగ్గజాలు నేతృత్వం వహించారు. కమ్యూనిస్టు పంథా విషయంలో తిరిగి సీపీఎం పార్టీలో తలెత్తిన విబేధాల మూలంగా 1967లో మరో చీలికకు దారితీసి 'నక్సల్ బరీ 'గ్రామంలో తలెత్తిన తిరుగుబాటుతో (భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు, లెనినిస్ట్ పార్టీ ,సీపీఐ(ఎంఎల్)గా ఉనికిలోకి వచ్చింది.బెం గాల్ నక్సల్బరీ రైతాంగ ఉద్యమం విభేదాలలోనే చారుమజుందార్, కానూసన్యాల్, వినోద్ మిశ్రా లాంటి నేతలు నక్సలైట్ ఉద్యమానికి బాటలు వేశారు. ఆంధ్రప్రదేశ్ లో దేవులపల్లి వెంకటేశ్వరరావు,తరిమల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి,పైలా వాసుదేవరావు, కొండపల్లి సీతారామయ్య లాంటి నేతలు పనిచేశారు.

**పబ్లిషర్ : కొక్కు రవికుమార్**


# ఏఐతో భాషా ప్రావీణ్యం వస్తుందా?



మదిలోని భావాన్ని వ్యక్తపరచే వాహకమే భాష. ఇది నమ్మకాలను ప్రోదిచేస్తుంది. సంస్కృతిని నిర్మిస్తుంది. చరిత్రను ఆమోదిస్తుంది. ఒక జాతికి గుర్తింపు తెచ్చిపెడుతుంది. తొలినాళ్లలో దూరంగా ఉన్నవారికి సమాచారం అందించడానికి దూతను పంపేవారు. ఆ తర్వాత ఉత్తరం వచ్చింది.దాని తర్వాత వచ్చిన ఫోన్ మాట్లాడే దూరాన్ని చెరిపేసింది. దీనికి అదనంగా మెయిల్, వాట్సాప్ వంటి సమాచార సాధనాలు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి. ఇపుడు నేరుగా మాట్లాడడానికి వీడియో కాల్స్ అందుబాటులో ఉన్నాయి. అయితే, ఎన్ని సాధనాలు వచ్చినా భాష మాత్రం మారలేదు. అలానే ఉన్నది. అప్పుడు, ఇప్పుడు ఇద్దర్ని కలిపేది మాటే. సాధనాలు మారాయి. అంతే..కానీ ప్రేరణ అలానే నిలిచి ఉన్నది. కృత్రిమ మేధ ఇపుడు నేర్చుకోవడం, పని పద్ధతులను తిరగ రాస్తున్నది. ఇది గణిత సమీకరణాలను పరిష్కరిస్తున్నది. వ్యాసాలు రచిస్తున్నది. సంగీత బాణీలను కడుతున్నది. ఇలా ఎన్నో చేస్తున్నది. ఈ మేధ ట్యూటర్‌గా, అనువాదకునిగా, సహచరునిగానూ వ్యవహరిస్తున్నది. తర్కం, స్థిరవ్యవస్థలపై నిర్మితమైన లెక్కలు, ఇంజినీరింగ్ తదితర శాస్త్ర విషయాలు ఇప్పటికే ఏఐ ప్రభావంతో రూపాంతరం చెందాయి. సంక్లిష్ట సైన్స్ సూత్రాల వివరాలు ఇప్పుడు ఏఐ ద్వారా తక్షణమే పొందగలుగుతున్నాం. కథలు చెప్పగలిగేవారే ప్రపంచంలో అత్యంత శక్తిమంతులు అంటారు పెద్దలు. మాట అంత మహత్తరమైనది. భాష ఒక జాతి సంస్కృతి, భావోద్వేగాల జీవన శ్వాస. ఏఐ వ్యాకరణాన్ని, పదజాలాన్ని వివరించగలదు. కానీ హాస్యం, వ్యంగ్యం, ప్రేమలు పట్టుకోలేదు. యంత్రం సాయంతో చేసిన అనువాదం సాంకేతికంగా సరిగానే ఉండవచ్చు. అయితే దీనిలో హృదయం లోపిస్తుంది. ఎవరైనా ఒకరు 'ఐ మిస్ యు' అంటే, దానిలో భావోద్వేగం ఇమిడి ఉంటుంది. ఆ ఉద్వేగ అనుభూతి యంత్రానికి సాధ్యం కాదు కదా! టెక్నాలజీ అనువాద క్రియను చాలా సులువు చేసింది. తెలుగు ఉత్తరమో, వ్యాసమో కేవలం క్షణాల్లో తప్పులు లేకుండా ఏఐ మరో భాషలోకి అనువదిస్తుంది. అది కచ్చితంగా ఉంటుంది. కానీ పేలవం అనిపిస్తుంది. అనువాదం అంటే ఒక భాష నుంచి మరో భాషలోకి తర్జుమా మాత్రమే కాదు కదా! అనువాదం అంటే విషయంలోకి పరకాయ ప్రవేశం చేసి అందించడం. అందుకే భాష భిన్నమైనదని భాషావేత్తలు చెప్తారు. సైన్స్ ఫార్ములా తెలుసుకోవడం ఓ వియుక్త నైపుణ్యం. మాట్లాడటమే భాష. మాటలో, నవ్వులో, స్వరంలో అనేక భావాలు దాగి ఉంటాయి. ఆలోచన చెప్పడంలో పొరపడి, జాగ్రత్తగా దిద్దుకుంటాం. ఇవి అన్నీ చిన్న చిన్న విషయాలు అనిపిస్తాయి. ఇవి తీపి,చేదు అనుభూతులు కలిగిస్తాయి. మనలో విశ్వాసం పెంపొందిస్తాయి. ఒకరితో ఒకరిని కలుపుతాయి. ఎందరో గురువులను అందిస్తాయి. భాష నేర్చుకోవడంలో మెలకువలు నేర్పుతాయి. ఇది సజీవ శిక్షణ. ఆ సజీవతను ఏ యాప్, చాట్ బోట్‌లు మనకు అందించగలవు? కృత్రిమమేధో సాధనాలు పలు రకాలుగా సాయపడతాయి. అవి పలుకుబడిని సరిచేస్తాయి. వ్యాకరణాన్ని వివరిస్తాయి. ఇంకా వ్యక్తిగతీకరించిన అభ్యాసాన్ని అందిస్తాయి. ఇవి టీచర్లకు బాగా ఉపయోగపడతాయి. పాఠ్యప్రణాళిక రాసుకోవచ్చు, విద్యార్థుల నుంచి వేగంగా అభిప్రా యాలూ సేకరించవచ్చు. ఎదుటి వ్యక్తి మాటల్లోని భావోద్వేగాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నాన్ని యంత్రాలు భర్తీ చేయలేవు. భాషాపటిమ ధారాళంగా మాట్లాడటం ద్వారా రాదు. సహానుభూతి ద్వారానే వస్తుంది. సజీవ భాషలు నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉంటాయి. యాస, మర్యాదపూర్వక సంభాషణా స్వరాలు మెల్లగా అనుభవంతో అలవడతాయి. యంత్రం వీటిని నమోదు చేయగలదు. కానీ అది మనిషి కాదు కదా! కనుక అది మన మాటల లయలో పాల్గొనలేదు. వినడం, అర్థం చేసుకోవడం, తగిన విధంగా ప్రతిస్పందించడం నిరంతర తర్ఫీదు, ఇదే నిజమైన భాషా ప్రావీణ్యత సాధనా మార్గం.

గత కొన్ని దశాబ్దాలుగా పట్టణీకరణ జోరందుకున్నది. ఆంగ్ల మాధ్యమ కాన్వెంట్ చదువులు విస్తృతంగా పెరిగాయి. ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ఇప్పుడు ఇంగ్లిష్ తప్పని సరైంది. నేడు ఏ భాషనైనా ఏఐ పరికరాల సాయంతో అనువదించడం చాలా సులువైంది. కష్టం లేకుండా చేస్తున్నది టెక్నాలజీ. ఇదే పెనుముప్పు కలిగించే అవకాశం ఉన్నది. భాష నేర్చుకోవలసిన అవసరం లేదనే భావన మనలో ఏర్పరుస్తున్నది. అందుకే టెక్నాలజీని నేర్పుగా వాడాలని భాషా శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భాష నేర్వడం అంటే పదవినియోగం, శ్రద్ధగా వినడం, జవాబు చెప్పడం, చదవడం, రాయడం మాత్రమే కాదు, సాంస్కృతిక సందర్భం గుర్తెరగాలి. ఇది సామాజిక సంబంధాలను నిలిపే సాధనం. కానీ వ్యక్తిత్వ ఎదుగుదలకు సోపానం. నూతన ఆలోచనా ప్రపంచాలను చేరువచేసే మార్గం. భాష నెమ్మదిగా వంటబడుతుంది. ఇలా నేర్చుకోవడంలో భావోద్వేగం, మానవతలు మిళితమై ఉంటాయి. ఇదే నిజమైన భాషా పండిత్య సాధనకు సోపానం. దీర్ఘకాల ప్రయత్నంతోనే భాషా పటిమ పట్టుబడుతుంది. ఈ సాధనే భాష సజీవంగా నిలిచి వెలిగేలా చేస్తుంది. సైన్స్ ఫార్ములా తెలుసుకోవడం ఓ వియుక్త నైపుణ్యం. మాట్లాడటమే భాష. మాటలో, నవ్వులో, స్వరంలో అనేక భావాలు దాగి ఉంటాయి. ఆలోచన చెప్పడంలో పొరపడి, జాగ్రత్తగా దిద్దుకుంటాం. ఇవి అన్నీ చిన్న చిన్న విషయాలు అనిపిస్తాయి. ఇవి తీపి, చేదు అనుభూతులు కలిగిస్తాయి.

# జీవన సాదృశ్యాలు జయంతి కథలు...




ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన రచయిత్రి–కవయిత్రి వాసరచెట్ల జయంతి సమాజంలోని సమస్యలపై స్పందిస్తూ తన సంఘర్షణ, ఆర్ద్రత, అందోళన, ఆలోచన, ప్రతిఘటనను సాంద్రంగా వినిపిస్తూ..'నేలవిమానం', 'తురాయిపూలు' శీర్షికలతో రెండు కవితా సంపుటాల్ని వెలువరించి, కవయిత్రిగా తన తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారు. శర్వమ్మ పేరు–ప్రాధాన్యత: రచయిత్రిగా ఆవిష్కరించినతొలికథల సంపుటి 'శర్వమ్మ మరణం' తోపాటు మొత్తం 19 కథలు ఉన్నాయి. ప్రతి కథ ఒక జీవితమే. జీవితాల్లోంచి పుట్టుకొచ్చినదే! రచయిత్రి తన అనుభవంలో చూసిన, విన్న, అంశాలనే తన కథలకు ఇతివృత్తాలుగా చేసుకుని, కొంత కల్పన జోడించి సగటు సజీవ జీవన చిత్రా లను తనదైన శైలిలో చిత్రిస్తూ వచ్చారు. ప్రముఖ కథా రచయిత పెద్దింటి అశోక్ కుమార్, ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రా దేవి ఈ కథలకు ప్రామాణికమైన ముందు మాటలు అందించారు. మ్యారేజి బ్యూరోల్లో కొందరు అబ్బాయిలు తప్పుడు వివరాలు ఇచ్చి, అమ్మాయిల జీవితాలతో ఆడుకునే పరిస్థితుల్ని 'తూరుపు సిందూరం' కథ కండ్లకు కట్టినట్టు గా చూపెట్టారు. కథలో కథానాయిక మో సాన్ని ధైర్యంగా జయించి ఆత్మవిశ్వాసంతో నిలబడుతుంది. ఆర్థిక బలహీనులు ఆత్మీ యులు అయినప్పటికీ వారిస్వేచ్ఛను, స్వతంత్రాన్ని హరిస్తూ... వాళ్ల బతుకుల్ని ఎదుటివాళ్లు ఏవిధంగా కబ్జా చేస్తుంటారో 'ఒక చేతివేళ్లు' కథలో స్పష్టంగా కనిపిస్తుంది. ఆర్తిలోంచి, ఆవేదన లోంచి, మేలుకుని..కోలుకుని.. ఆ త్మవిశ్వాసం వైపుగా ప్రయాణించిన కథ 'కొడిగట్టిన దీపం'. తోడువీడి వెళ్లాక కథలో భర్తను కోల్పోయిన ఒక స్త్రీ, తనదైన ఆత్మవిశ్వాసంతో కొత్త జీవితం ప్రారంభించి, భర్త కలల్ని నెరవేర్చిన తీరు కనిపిస్తుంది. బాధ్యత లేని సంతానానికి గుణపాఠం నేర్పుతూ ఆస్తిని చట్టబద్ధంగా అనాథలకు రాసిచ్చిన కథ'శర్వమ్మ మరణం'. శర్వమ్మ వీలునామా/ శర్వమ్మ నిర్ణయం వంటి పేర్లు కూడా ఈ కథకు సరిపోతాయి. కానీ 'శర్వమ్మ మరణం' పేరే సరైనది. ఆమె చావు కోసం ఎదురుచూస్తూ... ఆమెను శారీరకంగా, మానసికంగా హింసించిన కుటుంబ సభ్యులకు, ఆమె మరణం తర్వాత ఎదురయ్యే కోలుకోలేని దెబ్బ... ఆస్తి దక్కకుండా పోవడం. ఆమె చావు కోసం ఎదురుచూసిన వాళ్లే జీవచ్ఛవాలు అయిపోతారు. ప్రాంక్ వీడియోలు, ప్రాంక్ కాల్స్ వల్ల బలహీన మనస్కులకు ఎదురయ్యే ప్రమాదం గురించిన హెచ్చరించిన కథ–వినదగునెవ్వరు చెప్పిన. 'కొత్తతరం' కథ ఒక చైతన్య ప్రవంతి. ఈ కథలో రేవతి అనే గ్రామీణ బాలిక తన టీచర్ ద్వారా ప్లాస్టిక్‌కు బదులుగా జనపనార బ్యాగులు వాడొచ్చని తెలుసుకోవడం, ప్రకృతి పర్యావరణ సందేశాన్ని వ్యాపింపజేయడం ఇందులో కథాంశం. ఫలితంగా అమ్మాయి నివసించే పాలమూరు జిల్లాలో ఉన్న 'సిద్దాయిపల్లె' గ్రామం పేరు హైదరాబాద్‌లో మార్మోగుతుంది. ఇంకా 'ఎండమావి', 'తండ్రి ఋణం', 'సంభవామి యుగేయుగే', 'దిగ్బంధనం' వంటి మనసుకు హత్తుకునే, ఆలోచింపజేసే కథలు ఈ సంకలనంలో ఉన్నాయి.

జయంతి కథల్లో సమస్త జీవన విలువలు కనిపిస్తున్నప్పటికీ, పాత్రలన్నీ మన ఇరుగుపొరుగు వ్యక్తులుగా మనసుకు పరిచయం అవుతున్నప్పటికీ కథల్లో పాలమూరు ప్రాంతీయ జీవన విధానానికి పెద్దపీట వేశారు. అలాగే కథా సందర్భాన్ని అనుసరించి కులాలు–కులవృత్తుల్ని కూడా ప్రవేశపెట్టారు. రచయిత్రిగా జయంతి వాసరచెట్ల పాఠకుల హృదయానికి చేరువయ్యే కథల్ని సృజించారు. ఇందులో కొన్ని కథలు కథ ముగిసిన తర్వాత కూడా మనసును వెంటాడుతాయి. రాసిన ప్రతి కథలో ఒక అర్థాన్ని లేదా ఒక సందేశాన్ని లేదా ఒక పరమార్థాన్ని అందించిన జయంతి రచయిత్రిగా ఈ కథల ద్వారా తన పరిపూర్ణత ప్రదర్శించారని చెప్పవచ్చు. అందరూ తప్పకుండా పుస్తకం కొని చదవాల్సిన కథలు ఇవి. ప్రతులకు: వాసరచెట్ల జయంతి (9985525355).

# అక్రమ వెంచర్లు.. అడ్డగోలు విక్రయాలు?

నల్లగొండ : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం రామాజీ పేట గ్రామంలో సర్వేనెంబర్ 92 లో ఫామ్ ల్యాండ్ ప్లాట్లతో కూడిన వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఈ వెంచర్ లో 121 గజాలతో ప్లాట్లు లే అవుట్, 30 ఫీట్ల తో రోడ్లు నిర్మించారు. ఈ ప్లాట్ లలో దాదాపు పది రకాల మొక్కలను పెంచుతున్నారు. వాటిల్లో మామిడి, సపోటా, బత్తాయి, దానిమ్మ బొప్పాయి, పనస, జామ పండ్ల మొక్కలను డ్రిప్ సిస్టం ద్వారా నీరు సరఫరా చేసి మొక్కలను కాపాడుతున్నారు . సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అనువైన ధరలో ప్లాట్లు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయని, సోషల్ మీడియా లో ఫేస్బుక్ వేదికగా అందమైన వీడియోలు తీసి విక్రయానికి పెట్టారు. "" విజెఆర్ డెవలపర్స్" పేరుతో కొన్ని ఎకరాల భూమి కొనుగోలు చేసి ప్రభుత్వ అనుమతి లేకుండానే వెంచర్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడానికి అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యాపారానికి తెరలేపారు. వెంచర్లు చేయాలంటే నిబంధనలు..: భూమి వ్యవసాయ భూమి అయితే, దానిని



నాన్–అగ్రికల్చరల్ ఉపయోగం కోసం మార్చడానికి రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుండి అనుమతి తీసుకోవాలి.లే అవుట్ ప్లాన్‌ను స్థానిక అధికారులు లేదా డెవలప్‌మెంట్ అథారిటీ ఎవీణూ, ఖుజ్రా, స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ఆమోదించాలి. డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ లేదా స్థానిక పంచాయతీ అధికారుల నుండి అనుమతి అవసరం. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ లే అవుట్ ప్లాన్‌లో రోడ్లు, ఓపెన్ స్పేస్‌లు, డ్రైనేజీ, నీటి సరఫరా వంటి సౌకర్యాలకు సంబంధించిన నిబంధనలు పాటించాలి.

రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్ మెంట్) యాక్ట్, 2016ప్రకారం, 500చదరపు మీటర్లు లేదా8 ప్లాట్‌ల కు మించిన లే అవుట్ ప్రాజెక్ట్‌లు రాష్ట్ర పోర్టల్‌లో నమోదు చేయాలి. నమోదు కస్టమర్లకు పారదర్శకతను నిర్ధారిస్తుంది. లేఅవుట్‌లో భవన నిర్మాణాలు ఉంటే, ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అనుగుణంగా ఫైర్ డిపార్ట్‌మెంట్ నుండి చీూజ తీసుకోవాలి.స్థానిక పంచాయతీ/మున్సిపల్ అనుమతులు,స్థానిక గ్రామ పంచాయతీ లేదా మున్సిపల్ అధికారుల నుండి లే అవుట్ అనుమతి తీసుకోవాలి, ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాల కోసం కొన్ని సందర్భాల్లో, భూమి గ్రామ పంచాయతీ పరిధిలో ఉంటే, పంచాయతీ నుండి అనుమతి తప్పనిసరి.

# కాపు నేతల తిరుగుబాటు..!

**రాజమండ్రి:** కాపు అస్త్రంతో కూటమిని చీల్చాలని జగన్మోహన్ రెడ్డి భావించారు. ఇప్పుడు అదే కాపు అస్త్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గుచ్చుకోబోతోంది. కూటమిని ఇరకాటంలో పెట్టేందుకు, కాపు ఓటు బ్యాంకును ఆకట్టుకోవడానికి కాపుల అంశాన్ని ఒక రాజకీయ రణరంగంగా మార్చాలని జగన్ భావించారు. కానీ ఆ ప్రయత్నం వికటించి.. చివరకు సొంత పార్టీలోనే నిప్పు పెట్టబోతోందని సంకేతాలు వెలువడుతున్నాయి. పార్టీ లైన్ దాటి వైసిపి కాపు నేతలు వ్యవహరిస్తుండడం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. ప్రధానంగా కాపు రిజర్వేషన్ల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. వైసిపి కాపు నేతలే ఈ అంశాన్ని తెరపైకి తెచ్చి పార్టీని ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తుండడం విశేషం.కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ జరిగింది. అయితే సభకు హాజరైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాపు నేతలు కాపు రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావించారు. నిన్నటి వరకు జగన్మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా.. చాలా జాగ్రత్తగా మసులుకున్నారు నేతలు. ఇప్పుడు హఠాత్తుగా కాపు రిజర్వేషన్ల అజెండాను భుజానికి ఎత్తుకోవడం వెనుక సొంత పార్టీపై తిరుగుబాటు అన్నట్టు సంకేతాలు వస్తున్నాయి. ఎందుకంటే చంద్రబాబు ఇచ్చిన ఆర్థిక వెనుకబాటు రిజర్వేషన్లను కాపులకు నిలిపివేశారు జగన్మోహన్ రెడ్డి. ఇప్పుడు అదే కాపు రిజర్వేషన్లను ప్రస్తావించడం ద్వారా తమ అధినేత చేసిన తప్పిదాన్ని మరోసారి గుర్తు చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో కాపులకు రిజర్వేషన్ల హామీ ఇచ్చారు చంద్రబాబు. అయితే అధికారంలోకి కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని ప్రారంభించారు. అది పతాక స్థాయికి చేరుకోవడంతో చంద్రబాబు ప్రభుత్వం కాపులకు ఐదు శాతం ఈడబ్ల్యూఎస్ కోటాలో రిజర్వేషన్లను కేటాయించింది. కాపులు ఆర్థికపరమైన పథకాలను సొంతం చేసుకున్నారు. అయితే ఆ రిజర్వేషన్లను అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేశారు జగన్ మోహన్ రెడ్డి. రిజర్వేషన్లు అనేది కేంద్రం పరిధిలోని అంశం అని.. అది తన వల్ల కాదు అని తేల్చి చెప్పారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి

## - శాంతి కమిటీ సమావేశంలో సీ.పీ, అదనపు కలెక్టర్ - అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు - డీ.జే లపై నిషేధం అమలు



నిజామాబాద్, సెప్టెంబర్ 08 ( ప్రజా గళం ప్రతినిధి )గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు. వినాయక చతుర్థి ఉత్సవాలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు సంబంధిత అధికారులకు కీలక సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలు, జెండా బాలాజీ జాతర సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు, అందుబాటులోకి తేవాల్సిన సదుపాయాల గురించి సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, మండపాల నిర్వాహకులు పలు ప్రతిపాదనలు చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. శాంతియుత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో మతసామరస్యానికి ప్రతీకగా వేడుకలు జరిగేలా కృషి చేస్తామని అన్నారు. సీ.పీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావులు మాట్లాడుతూ, ఉత్సవాల నిర్వహణకు అధికార యంత్రాంగం తరపున పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని, రోడ్ల మరమ్మతులు, శోభాయాత్రకు అడ్డంకిగా ఉండే చెట్ల కొమ్మలను తొలగించడం వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో సహృద్భావ వాతావరణంలో ఈ వేడుకలు జరుగుతాయని, ఈసారి కూడా అదే స్ఫూర్తిని ప్రదర్శిస్తూ గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని, జిల్లా ప్రతిష్టను పెంపొందించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరు కూడా విద్యుదాఘాతం బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మంటపాల వివరాలను ట్రాన్స్ కో అధికారులకు తెలియజేసి, ఆ శాఖ సిబ్బంది ద్వారానే విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాలని హితవు పలికారు. షార్ట్ సర్క్యూట్ వంటి వాటిని నిరోధించే ఉపకరణాలను అమర్చుకోవాలని హితవు పలికారు. ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడకుండా, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా వినాయక మంటపాలు ప్రతిష్టించాలని సూచించారు. 8 అడుగుల కంటే తక్కువ ఎత్తు కలిగిన విగ్రహాలను మాత్రమే బాసర గోదావరిలో నిమజ్జనానికి అనుమతిస్తామని, అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను ఉమ్మెడ వద్ద నిమజ్జనం చేయాలని సూచించారు. భారీ శబ్దాల వల్ల చిన్నారులు, వృద్దులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉన్నందున మంటపాల వద్ద డీ.జే సౌండ్లను నిషేధించడం జరిగిందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్పష్టం చేశారు. మండపాల వద్ద భక్తి పాటలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా నిర్వాహకులు కృషి చేయాలన్నారు. ఇతరులను కించపరిచేలా, అసభ్యకరంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు. మండపాల వద్ద రాత్రి సమయంలోనూ నిర్వాహకులలో ఎవరో ఒకరు తప్పనిసరిగా బస చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు మట్టి విగ్రహాలను ప్రతిష్టించేలా యువతను ప్రోత్సహిస్తూ పర్యావరణ హితానికి పాటుపడాలని హితవు పలికారు. ప్లాస్టిక్ వినియోగాన్ని కూడా విడనాడితే పర్యావరణానికి ఎంతో మేలు చేసిన వారు అవుతారని అన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మకూడదని, ఎక్కడైనా ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తేవాలని, ప్రతి ఒక్కరు సంయమనం పాటిస్తూ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని సూచించారు సమస్యాత్మక ప్రాంతాలు, ప్రార్థనాలయాల వద్ద సి.సి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. సామాజిక మాధ్యమాల పోస్టింగ్ లపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, ప్రశాంతతకు భంగం కలిగిస్తూ, అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సహృద్భావ వాతావరణంలో పరస్పర సహకారంతో శోభాయమానంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలని, వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ప్రతి మండపం వద్ద పోలీసులను నియమిస్తామని అన్నారు. కాగా, వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రక్రియను ఆద్యంతం అధికారులు పర్యవేక్షణ జరపాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతూ క్రేన్, లైటింగ్ వ్యవస్థ, అత్యవసర వైద్యం, అంబులెన్స్, తాగునీరు, బారికేడింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పారిశుధ్యం వంటి చర్యలు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను అదనపు కలెక్టర్ భుజంగరావు ఆదేశించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో శోభాయాత్రలో పాల్గొనే వాహనాల్లో ఎటువంటి యాంత్రిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, నిమజ్జన యాత్ర కొనసాగే ప్రాంతాలలో రోడ్లకు ఇరువైపులా కిందికి వేలాడే కరెంటు తీగలు, వంగి ఉన్న చెట్ల కొమ్మలు వంటివి ఏవైనా అడ్డంకులు ఉంటే వాటిని తొలగించాలని, ప్యాచ్ వర్క్ చేపట్టి రోడ్లపై ఏర్పడిన గుంతలను మూసివేయాలని అన్నారు. చెరువులు, గోదావరి పరీవాహక ప్రాంతాల వద్ద సరిపడా సంఖ్యలో క్రేన్ లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు, జెండా బాలాజీ వేడుకల సందర్భంగా నిర్ణీత రోజుల్లో మద్యం విక్రయాలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు సూ చించారు. ఈ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని అవగాహన కల్పిస్తూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. సమావేశంలో నగర మేయర్ ఉమారాణి, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్ అలీ, వివిధ శాఖల అధికారులు, సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ట్రెసా రాష్ట్ర నూతన అధ్యక్షకార్యదర్శులకు ఘనసన్మానం

## -ర్యాలీతో ఘనస్వాగతం పలికిన రెవెన్యూ ఉద్యోగ సంఘాలు




**నిజామాబాద్ సిటీ , సెప్టెంబర్ 8(ప్రజాగళం )**తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా ) నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కె. గౌతమ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎల్. రమణ్ రెడ్డిని నిజామాబాద్‌లోని రెవెన్యూ భవన్‌లో జిల్లా రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఉద్యోగులు నూతన రాష్ట్ర నాయకత్వానికి శుభాకాంక్షలు తెలిపారు.వారి నాయకత్వంలో ట్రెసా మరింత బలోపేతం కావడంతో పాటు రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమర్థవంతంగా కృషి జరగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ట్రెసా నూతన అధ్యక్షులు కె. గౌతమ్ కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ట్రెసా నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ప్రధానకార్యదర్శి ఎల్. రమణ్ రెడ్డి నిబద్ధతతో పనిచేసే నాయకుడని, ఉద్యోగుల సమస్యలపై ఓర్పుతో పోరాడే యువ నాయకుడిగా ఆయనను అభివర్ణించారు. ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు.నూతన నాయకత్వంలో ఉద్యోగుల చిరకాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, సంక్షేమం, హక్కుల పరిరక్షణకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని రెవెన్యూ ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఉద్యోగుల ఐక్యతను చాటుతూ ఉత్సాహభరిత వాతావరణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బోధన్ డివిజన్, ఆర్మూర్, కలెక్టరేట్, జీపీఓ ల సంఘాల ప్రతినిధులు, అలాగే జిల్లాలోని పలువురు రెవెన్యూ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన రాష్ట్ర నాయకత్వానికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ట్రెసా కార్యదర్శి ప్రశాంత్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రావు, కోశాధికారి విజయ్ కాంత్ రావు, వైస్ ప్రెసిడెంట్లు భూపతి ప్రభు, వినయ్ సాగర్‌తో పాటు ట్రెసా సీనియర్ నాయకుడు, డిచ్ పల్లి తహసీల్దార్ సతీష్ రెడ్డి పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అసెంబ్లీ ఆవరణలో దాడికి నిరసనగా ధర్నా



**నిజామాబాద్ సిటీ , సెప్టెంబర్ 8(ప్రజాగళం )**అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ పార్టీ మహిళ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలపై జరిగిన దాడిని నిరసిస్తూ నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల పిలుపు మేరకు మంగళవారం అర్బన్ మహిళ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చౌరస్తా ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మహిళ నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి నిలయమైన అసెంబ్లీ ఆవరణలో మహిళా ప్రజాప్రతినిధులపై దాడి జరగడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.మహిళా ఎమ్మెల్యేలపై దాడికి బాధ్యులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.మహిళా ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాలి -- ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి అంటూ నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతుకిరణ్,మాజీ కార్పొరేటర్లు విశాలిని రెడ్డి, సిర్ప సువర్ణ,మంజుల యాదవ్,చింతకాయల అలేఖ్య,గంగ ,సంధ్య తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# Hpv వ్యాక్సిన్ వ్యాక్సిన్ తప్పక తీసుకోవాలి..



**ప్రజా గళం/నిజామాబాద్ ప్రతినిధి:**ఎచ్ పి వి వ్యాక్సిన్ ను 6 నుంచి 14 ఏళ్ల బాలబాలికలు తప్పక తీసుకోవాలనీ అల్లు అర్జున్ ఫ్యాన్స్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండల సురేష్ కోరారు. మంగళవారం సెప్టెంబర్ 8 తేదీన అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర పిలుపులో భాగంగా రాష్ట్ర అల్లు అర్జున్ ఫ్యాన్స్ అధ్యక్షులు అంజి యాదవ్ ఆదేశాల మేరకు ఎచ్ పి వి (హ్యూం )వ్యాక్సిన్ అవగాహన కార్యక్రమం అల్లు అర్జున్ ఫ్యాన్స్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండల సురేష్ ఆధర్వంలో జనసేన నిజామాబాద్ జిల్లా నాయకులు గుండా సంతోష్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మగుట్ట 20 డివిజన్ లో ముఖ్యఅతిథిగా 20డివిజన్ కార్పొరేటర్, బీజేపీ సీనియర్ నాయకులు న్యాలం రాజు ఎల్లమ్మగుట్ట లోని ఆక్స్ఫర్డ్ స్కూల్ ఎజూజ వ్యాక్సిన్ కార్యక్రమంలో పాల్గొని వ్యాక్సిన్ ప్రాధాన్యత గురించి వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ రమణ మరియు స్కూల్ టీచర్స్ కూడా పాల్గొన్నారు తధానంతరం న్యూ ప్రియదర్శని స్కూల్ ప్రిన్సిపల్ పుష్పలత ప్రకాష్ పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ జిల్లా నగర కమిటీ సభ్యులు నవీన్. దీపక్. మహేష్. గోపి. బబ్లు. కార్తీక్. సుమంత్. విగ్నేష్. లక్ష్మణ్.శ్రీను.విజయ్ అభిమానులు పాల్గొన్నారు

# డా. గంట్యాలకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం




**ప్రజా గళం నిజామాబాద్ ప్రతినిధి:**డా. గంట్యాలకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. మంగళవారం లయన్స్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ రవీంద్రభారతిలో గురు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠ్యపుస్తక రచయితగా, కవిగా, రచయితగా, డిస్టిక్ రిసోర్స్ పర్సన్ గా, విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి కై కృషి చేస్తున్నందుకు గాను విశేషమైన భాష సాహిత్య సేవలను అందించినందుకు గాను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని తనకు అందించినట్లు డా. గంట్యాల ప్రసాద్ తెలిపారు. మల్లారం పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ గంట్యాల ప్రసాద్ కు లయన్స్ ఇంటర్నేషనల్ పురస్కారాన్ని అందించడం తమకెంతో ఆనందంగా ఉందని ప్రధానోపాధ్యాయులు జి. రామ్మోహన్ ఆనందాన్ని వ్యక్తపరిచారు. వీరు సేవలను కొనియాడారు. సీనియర్ ఉపాధ్యాయులు భూమా గౌడ్ తంగుడిగా శ్రీనివాస్ అరకొండ యాదగిరి బట్టు రాజేందర్ తదితర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.


# బోధన్ కాంగ్రెస్ బిఆర్ఎస్ బోధన్?లో ఉద్రిక్తత.. బాహాబాహికి దిగిన కాంగ్రెస్?,బీఆర్?ఎస్? నాయకులు


## - కాంగ్రెస్, బీఆర్?ఎస్? నాయకులు బాహాబాహికి దిగడంతో బోధన్? పట్టణంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.



**బోధన్? ప్రతినిధి,సెప్టెంబర్ 8:(ప్రజా గళం)**కాంగ్రెస్,బీఆర్?ఎస్? నాయకులు బాహాబాహికి దిగడంతో బోధన్ పట్టణంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది.స్పీకర్?పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు.అదే సమ యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపేందుకు అంబేద్క ర్ చౌరస్తాకు చేరుకున్నారు.ఇరు పార్టీల నాయకులు పోటాపోటీగా నిరసనలు చేపట్టారు.అనంతరం ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఒక్కసారిగా చౌరస్తా వద్ద పరిస్థితి ఉద్రిక్తత నెలకొంది.దీంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.కాంగ్రెస్? వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్?ఎస్? నాయకులు అంబేద్కర్? విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు.అయితే స్పీకర్?ను అవమానించి న బీఆర్?ఎస్? నాయకులు అంబేద్కర్?కు వినతిపత్రం ఇచ్చే నైతిక హక్కు లేదని పేర్కొంటూ కాంగ్రెస్? నాయ కులు ఆగ్రహించారు.అనంతరం అంబేద్కర్? విగ్రహానికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిల ర్లు తూము శరత్ రెడ్డి, ఆదినారాయణ,మీర్? గౌస్, పట్టణ కాంగ్రెస్? అధ్యక్షుడు అంకు దాము,బీఆర్ఎస్ నాయకులు ముషీర్,బాబా, మోబిన్ ఖాన్,గుమ్ముల అశోక్ రెడ్డి,పట్టణ బీఆర్?ఎస్? అధ్యక్షుడు రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగేళ్ల కూతురితో కలిసి అశోక్ సాగర్ లో దూకి తల్లి, ఆత్మహత్య






**నిజామాబాద్ క్రైమ్ సెప్టెంబర్ 8 (ప్రజాగళం )** నిజామాబాద్ నగర శివారులోని అశోక్ సాగర్ లో తన నాలుగేళ్ల కూతురుతో తల్లి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఇద్దరి మృతదేహాలు మంగళవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో పోలీసులు గుర్తించారు. జిల్లా కేంద్రంలోని నగరంలోని హష్మీ కాలనీకి చెందిన షేక్ ఆసిఫ్ (40) తన నాలుగేళ్ల కూతురితో నివాసముంటుంది. తన భర్త దుబాయ్ లో ఉండడంతో కూతురుతో కలిసి జీవిస్తుంది. అయితే అభం శుభం తెలియని నాలుగేళ్ల కూతురు నేహా అఫ్రీన్ తో నగర శివారులోని అశోక్ సాగర్ లో దూకి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. అయితే ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. ఎడపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చరికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

# ఎమ్మెల్సీ తాత మధు పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

## - ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం



**నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 8 ( ప్రజాగళం )** తెలంగాణ శాసనసభ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధు పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్లమారి సుధాకర్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ మేడిపపన్న న్యాయకత్వంలో మంగళవారం నిజామాబాద్ నగరంలోని పులంగ్ చౌరస్తా లో స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాత మధు కుమార్ ఎమ్మెల్సీ పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలనీ. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యకులు మల్ల మరి సుధాకర్ ఆధ్వర్యంలో తాత మధు దిష్టి బొమ్మను దహనం చేశారు.అతని పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన ఎమ్మెల్సీ తాత మధు ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ దిష్టిబొమ్మ దహన కార్యక్రమంలో నగర మహిళా అధ్యక్షురాలు సమ్ ధాన .. రాహుల్ , భిన్న నగర మాదిగ మహిళలు పాల్గొనడం జరిగింది.

# ముస్తాబవుతున్న భారీ 54 అడుగుల మట్టి గణనాధుడు



**ప్రజా గళం నిజామాబాద్ ప్రతినిధి:**తెలంగాణ రాష్టంలోనే అతిపెద్ద 54అడుగుల మట్టి గణపతిని పోచమ్మ గల్లీలో రవితేజ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో ముస్తాబవుతోందనీ అద్యక్షులు నీలగిరి రాజు తెలిపారు.రవితేజ యూత్ గణేష్ మండలి 1987లో స్థాపించారు. తర్వాత 2012 గణేష్ మండలి సిల్వర్ జూబ్లీ సందర్భంగా రవితేజ యూత్ సొసైటీ గా మార్చినట్లు తెలిపారు. సిల్వర్ జూబ్లీ సందర్భంగా పర్యావరణన్ని కాపాడాలని ఉద్దేశం తో ఆనాటి నుంచి ఈనాటివరకు భారీ మట్టి వినాయక విగ్రహాలు పెడుతూ జిల్లా రాష్ట్ర మన్ననలు పొందండి జరిగిందనీ, సిద్ధం అయిన తర్వాత భక్తుల దర్శనార్థం ప్రత్యేక ఏర్పాటు చేస్తామని నీలగిరి రాజు తెలిపారు.

# మైక్రోసాఫ్ట్‌లో 5,000 మంది అవుట్!




ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న ఐటీ నిపుణులకు టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కోలుకోలేని షాక్ ఇవ్వబోతోంది. సంస్థలో మరోసారి భారీ ఎత్తున ఉద్యోగ కోతలు విధించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ కొత్త లేఆఫ్స్ పరంపరలో భాగంగా కంపెనీ తన గ్లోబల్ వర్క్‌ఫోర్స్ నుంచి సుమారు 2.5 శాతం మంది సిబ్బందిని తొలగించనుందట. దీనివల్ల ఒకేసారి 5,000 మందికి పైగా ఉద్యోగుల జీవనోపాధి దెబ్బతినే ప్రమాదం ఉందని సమాచారం. మైక్రోసాఫ్ట్ ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , జెనరేటివ్ ఏఐ టెక్నాలజీ మౌలిక సదుపాయాలలో వేల కోట్ల పెట్టుబడులు పెడుతోంది. ఈ కొత్త సాంకేతికత సంస్థ యొక్క పాత సాఫ్ట్‌వేర్ వ్యాపారాన్ని దెబ్బతీస్తుందేమోనని ఇన్వెస్టర్లు భయపడుతున్నారు. దీంతో ఏఐ వైపు వేగంగా అడుగులు వేస్తున్న మైక్రోసాఫ్ట్.. ఆ ఖర్చులను భర్తీ చేయడం కోసం సాధారణ వ్యయాలను తగ్గించుకుంటోంది. ఇందులో భాగంగానే సేల్స్, కన్సల్టింగ్, గేమింగ్ విభాగాల్లోని ఉద్యోగులపై వేటు వేయనున్నారు. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్‌లో దాదాపు 2,20,000 మంది ఉద్యోగులు ఉన్నారు. యూఎస్ ఉద్యోగుల కోసం ఇప్పటికే సంస్థ ఒక ప్రత్యేక స్వచ్ఛంద పదవీ విరమణ కార్యక్రమాన్ని కూడా తెచ్చింది. వయస్సు, మొత్తం సర్వీసు అనుభవం కలిపి 70 సంవత్సరాలు దాటిన వారికి ఈ సదుపాయం వర్తించనుంది. గత నెల రోజుల్లో మైక్రోసాఫ్ట్ స్టాక్ ఏకంగా 17 శాతం మేర పతనమైంది. ఈ తీవ్ర ఆర్థిక ఒత్తిడి కారణంగానే కంపెనీ ఖర్చులను అదుపు చేయడానికి ఉద్యోగులను రోడ్డున పడేసే కఠిన నిర్ణయానికి మొగ్గు చూపుతోందని అంటున్నారు. ఇప్పటికే గూగుల్, అమెజాన్, మెటా, ఒరాకిల్ వంటి సంస్థలు వేలాది మందిని తొలగించగా.. ఇప్పుడు ఆ జాబితాలోకి మైక్రోసాఫ్ట్ కూడా చేరడం ఐటీ రంగాన్ని వణికిస్తోంది.

# వాట్సాప్ కొత్త ఫీచర్‌పై మెటా కీలక ప్రకటన...



వాట్సాప్‌లో త్వరలో అందుబాటులోకి రానున్న యూజర్‌నేమ్ ఫీచర్‌పై నెలకొన్న సందేహాలకు మెటా సంస్థ స్పష్టత ఇచ్చింది. ఈ ఫీచర్ వల్ల సైబర్ మోసాలు పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో, ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పలు కీలక ప్రశ్నలకు సమాధానాలు వెల్లడించింది.

ఇటీవల ఈ ఫీచర్‌పై ప్రభుత్వం నోటీసు జారీ చేసిన నేపథ్యంలో దీనిపై చర్చ మరింత పెరిగింది. మెటా వెల్లడించిన వివరాల ప్రకారం.. వాట్సాప్‌లో యూజర్‌నేమ్ సృష్టించడం పూర్తిగా ఐచ్ఛికం. వినియోగదారులు కోరుకుంటే మాత్రమే యూజర్‌నేమ్‌ను సెట్ చేసుకోవచ్చు.

ఇప్పటికే ఫేస్‌బుక్ లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో ఉపయోగంలో ఉన్న కొన్ని యూజర్‌నేమ్‌లు, అలాగే ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, ధృవీకరించబడిన ఖాతాలకు సంబంధించిన పేర్లు రక్షితంగా ఉంటాయని కంపెనీ తెలిపింది. యూజర్‌నేమ్‌లను ఉపయోగించి సందేశాలు పంపే సదుపాయం ప్రస్తుతం అందుబాటులో లేదని వాట్సాప్ స్పష్టం చేసింది. ఈ ఫీచర్ అమల్లోకి వచ్చిన తర్వాత కొత్త వ్యక్తి సందేశం పంపితే, అతని దేశ వివరాలతో పాటు హెచ్చరిక సందేశం కూడా కనిపిస్తుందని తెలిపింది. అంతేకాకుండా అనుమానాస్పద ఖాతాలు, మోసపూరిత కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. యూజర్‌నేమ్‌ను ఎవరైనా తెలుసుకున్నంత మాత్రాన మీకు నేరుగా సందేశాలు పంపలేరని కూడా కంపెనీ స్పష్టం చేసింది. వాట్సాప్‌లో యూజర్‌నేమ్‌లను నేరుగా శోధించే అవకాశం ఉండదని, అదనపు భద్రత కోసం "యూజర్‌నేమ్ కీ" అనే ప్రత్యేక సెక్యూరిటీ ఫీచర్‌ను కూడా అందిస్తున్నట్లు వెల్లడించింది. ఈ కీని వినియోగదారులు ఎప్పుడైనా మార్చుకునే అవకాశం ఉంటుందని తెలిపింది. అదే యూజర్‌నేమ్‌ను ఫేస్‌బుక్ లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో ఉపయోగించాలనుకుంటే ఆయా ఖాతాలను లింక్ చేయాల్సి ఉంటుందని మెటా పేర్కొంది. అయితే, పూర్తిగా కొత్త యూజర్‌నేమ్‌ను కూడా ఎంచుకోవచ్చని స్పష్టం చేసింది. అలాగే యూజర్‌నేమ్‌ను భవిష్యత్తులో అవసరమైతే మార్చుకునే అవకాశం కూడా ఉంటుందని తెలిపింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నట్లుగా ప్రముఖుల పేర్లను ఎవరైనా ముందుగానే రిజర్వ్ చేసుకోవడం సాధ్యం కాదని మెటా ఖండించింది. ఆ పేర్లను ఆయా అసలు యజమానులు లేదా ధృవీకరించబడిన ఖాతాలే ఉపయోగించగలవని వివరించింది. వినియోగదారుల అభిప్రాయాలను సేకరించిన తర్వాత ఈ ఏడాది చివర్లో యూజర్‌నేమ్ ఫీచర్‌ను అధికారికంగా అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ యోచిస్తోంది.

# కనకం ఇలా షాకిచ్చిందేంటి..?



వరుసగా రెండు రోజులు తగ్గిన బంగారం ధరలు ఈరోజు మళ్లీ షాకిచ్చాయి. గత రెండ్రోజుల్లో ఎంత తగ్గిందో మళ్లీ ఇవాళ ఒక్కరోజే అంతకు పెరిగింది. హమ్మయ్య పుత్తడి ధరలు తగ్గాయి అని పసిడి ప్రియులు ఊపిరి పీల్చుకునే లోపే కనకం షాకిచ్చింది. నేడు తులం బంగారం ధర రూ. 3770 పెరిగింది. కిలో సిల్వర్ ధర రూ. 5000 పెరిగింది.

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం (99.9% స్వచ్ఛత) గ్రాముకు రూ. 14,455, 22 క్యారెట్ల బంగారం (91.6% స్వచ్ఛత) గ్రాముకు రూ. 13,250, 18 క్యారెట్ల బంగారం (75% స్వచ్ఛత) గ్రాముకు రూ. 10,841 వద్ద అమ్ముడవుతున్నాయి. హైదరాబాద్ లో 24క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 3770 పెరిగి రూ. 1,44,550 కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 3450 పెరిగి రూ. 1,32,500 కి చేరింది.


దేశ రాజధాని ఢిల్లీలో 24క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,44,700 వద్ద అమ్ముడవుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,32,650 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ లో కిలో సిల్వర్ ధర రూ. 2,50,000కి చేరింది. ఢిల్లీలో కేజీ వెండి ధర రూ. 5000 పెరిగి రూ. 2,45,000 వద్ద సేల్ అవుతోంది.

# జీఎస్టీ వసూళ్ల జోరు... రూ.1.95 లక్షల కోట్లకు చేరిన ఆదాయం





దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా కొనసాగుతున్న సంకేతాలు మరోసారి కనిపించాయి. వస్తువులు, సేవల పన్ను వసూళ్లు గత ఏడాదితో పోలిస్తే 13.9 శాతం పెరిగి సుమారు రూ. 1.95 లక్షల కోట్లకు చేరాయి. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, దేశీయ లావాదేవీల నుంచి వచ్చిన స్థూల జీఎస్టీ వసూళ్లు 6.5 శాతం పెరిగి సుమారు రూ. 1.35 లక్షల కోట్లకు చేరాయి. మరోవైపు, దిగుమతులపై వసూలైన జీఎస్టీ ఆదాయం 34.6 శాతం వృద్ధితో రూ. 60,038 కోట్లకు చేరడం విశేషం. జూన్ నెలలో మొత్తం జీఎస్టీ రీఫండ్‌లు 29.1 శాతం పెరిగి రూ. 32,436 కోట్లకు చేరాయి. రీఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్టీ వసూళ్లు 11.2 శాతం పెరిగి రూ. 1.62 లక్షల కోట్లకు పైగా నమోదయ్యాయి. ఇది దేశంలో పన్ను వసూళ్ల స్థిరమైన వృద్ధిని సూచిస్తోంది. జూన్ 2026లో రాష్ట్రాల వారీగా చూస్తే మహారాష్ట్ర అత్యధికంగా రూ. 30,714 కోట్ల జీఎస్టీ వసూళ్లతో అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాదితో పోలిస్తే అక్కడ 9 శాతం వృద్ధి నమోదైంది. దీని తర్వాత కర్ణాటక రూ. 12,937 కోట్లతో రెండో స్థానంలో, గుజరాత్ రూ. 11,743 కోట్లతో మూడో స్థానంలో నిలిచాయి. హర్యానాలో రూ. 10,065 కోట్ల వసూళ్లు నమోదవగా, ఉత్తరప్రదేశ్‌లో రూ. 9,165 కోట్ల జీఎస్టీ వసూలైంది. ఉత్తరప్రదేశ్‌లో ఏకంగా 19 శాతం వృద్ధి నమోదవడం విశేషం. ఢిల్లీలో జీఎస్టీ వసూళ్లు రూ. 5,987 కోట్లు కాగా, తెలంగాణలో రూ. 5,050 కోట్లుగా నమోదయ్యాయి. తెలంగాణ లో గత ఏడాదితో పోలిస్తే 11 శాతం వృద్ధి నమోదైంది. దక్షిణాది రాష్ట్రాల్లో కేరళ రూ. 3,159 కోట్ల జీఎస్టీ వసూలు చేయగా, పంజాబ్ రూ. 2,491 కోట్లతో 14 శాతం వృద్ధిని నమోదు చేసింది. అస్సాంలో రూ. 1,492 కోట్ల జీఎస్టీ వసూలై 17 శాతం పెరుగుదల నమోదైంది. గోవాలో జీఎస్టీ వసూళ్లు రూ. 604 కోట్లకు చేరి 11 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలలు (ఏప్రిల్ -జూన్) కలిపి స్థూల జీఎస్టీ వసూళ్లు రూ. 6,31,699 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 8.4 శాతం పెరుగుదల. ఈ కాలంలో దేశీయ లావాదేవీల నుంచి వచ్చిన స్థూల జీఎస్టీ ఆదాయం 2.8 శాతం పెరిగి రూ. 4,54,427 కోట్లకు చేరగా, దిగుమతుల నుంచి వచ్చిన జీఎస్టీ ఆదాయం 26.2 శాతం పెరిగి రూ. 1,77,273 కోట్లకు చేరింది. దేశీయ వినియోగం, వ్యాపార కార్యకలాపాలు, దిగుమతుల్లో పెరుగుదల కారణంగా జీఎస్టీ వసూళు స్థిరంగా పెరుగుతున్నాయని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ వృద్ధి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయానికి ఊతమివ్వడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కూడా దోహదం చేయనుంది.

# 27 నిమిషాల్లోనే రూ.2.82 లక్షల కోట్లు లాభం....!



దేశీయ స్టాక్ మార్కెట్లలో బుల్ రన్ కొనసాగుతోంది. జూలై నెల ప్రారంభం నుంచి మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా భారీ లాభాలతో దూసుకుపోతున్నాయి. గురువారం ట్రేడింగ్ ప్రారంభమైన కేవలం 27 నిమిషాల్లోనే ఇన్వెస్టర్ల సంపద ఏకంగా రూ. 2.82 లక్షల కోట్లు పెరిగింది. బుధవారం నాటి లాభాలను కూడా కలిపితే.. గడిచిన రెండు రోజుల్లోనే ఇన్వెస్టర్లకు రూ. 5 లక్షల కోట్లకు పైగా రికవరీ లభించడం విశేషం. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల పరిణామాలు భారత మార్కెట్లకు ఊతాన్నిచ్చాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రధానంగా నాలుగు కారణాలు మార్కెట్ ర్యాలీకి కారణమయ్యాయని వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 1% తగ్గి, బ్యారెల్‌కు 70.79 డాలర్ల వద్దకు పడిపోయింది. అమెరికా ? ఇరాన్ మధ్య జరుగుతున్న చర్చల్లో సానుకూల పురోగతి ఉండటంతో ఆయిల్ ధరలు దిగొచ్చాయి. జూన్ నెలలో దేశీయ ప్యాసింజర్ వాహనాల విక్రయాలు 25% పెరిగి దాదాపు 4 లక్షల యూనిట్లకు చేరడం ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌కు అద్దం పట్టింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఈఎఐ) అమ్మకాల ఒత్తిడి తగ్గడం కూడా మార్కెట్‌కు కలిసొచ్చింది. దక్షిణ కొరియా వంటి దేశాల్లో ఏఐ (ంఎ) ఆధారిత ట్రేడింగ్ బలహీనపడటం, భారతదేశం లాంటి నాన్-ంఎ మార్కెట్లకు అనుకూలంగా మారింది. గురువారం ఉదయం ట్రేడింగ్ ప్రారంభంలోనే 30 షేర్ల బీఎస్ఈ (బూఇ) సెన్సెక్స్ 526.61 పాయింట్లు పెరిగి 77,449.25 వద్దకు చేరింది. అటు 50 షేర్ల ఎన్ఎస్ఈ (బూఇ) నిఫ్టీ కూడా 153.6 పాయింట్ల లాభంతో 24,159.45 వద్ద ట్రేడ్ అయింది.

# పడకేసిన తయారీ రంగం



అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం, దేశీయంగా నెలకొన్న తీవ్ర పోటీ కారణంగా భారత తయారీ రంగం మందగించింది. ఈ ఏడాది జూన్‌లో తయారీ రంగం వృద్ధి తగ్గిందని ఎస్ అండ్ పి గ్లోబల్ నిర్వహించిన హెచ్ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) వెల్లడించింది. జూన్ నెలలో పీఎంఐ 54.2 పాయింట్లకు పరిమితమయ్యిందని పేర్కొంది. మే నెలలో 55 పాయింట్లుగా ఉన్న ఈ సూచీ.. గత మూడు నెలలతో పోలిస్తే ఇదే అత్యల్ప స్థాయి అని సర్వే వెల్లడించింది. తయారీ రంగంలో కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి, ఎగుమతులు, నియామకాల వేగం తగ్గడం ఈ పతనానికి ప్రధాన కారణాలని విశ్లేషించింది.

పీఎంఐ సూచీ 50 పాయింట్ల కంటే పైన కొనసాగితే కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ ఇటీవల ఈ సూచీ పడిపోవడం ఆందోళకరం. జూన్ నెలలో పీఎంఐ 54.2 పాయింట్లకు పరిమితమయ్యిందని పేర్కొంది. మే నెలలో 55 పాయింట్లుగా ఉన్న ఈ సూచీ.. గత మూడు నెలలతో పోలిస్తే ఇదే అత్యల్ప స్థాయి అని సర్వే వెల్లడించింది. గతేడాది మార్చి తర్వాత ఎగుమతులు అత్యంత బలహీనమైన వృద్ధిని నమోదు చేశాయి.

# భాగ్యనగరంలో 20 వేల మంది అక్రమవలసదారులా




**హైదరాబాద్, జూలై 2 :** కేంద్ర ప్రభుత్వ హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణలో అక్రమ వలసదారులపై నిఘా సంస్థలు జరిపిన విచారణలో విస్తుబోయే నిజాలు వెల్లడయ్యాయి. హైదరాబాద్ నగరంలోనే దాదాపు 21,563 మంది అక్రమ వలసదారులు ఉన్నట్లు తేలింది. వీరిలో 9,500 మంది రోహింగ్యాలు, 4 వేల మంది బంగ్లాదేశీయులు, 1,400 మంది ఆఫ్రికన్ జాతీయులు ఉన్నారు. తక్కువ జీవన వ్యయం, ఎక్కువ ఉపాధి అవకాశాల వల్ల వీరంతా హైదరాబాద్ బాట పట్టారు. ఈ నేపథ్యంలో రోహింగ్యాల నివాసం జాతీయ భద్రతకు తీవ్ర ఆందోళనకరమని నకిలీ గుర్తింపు పత్రాలు రద్దు చేయాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలోకి చొరబడుతున్న అక్రమ వలసదారుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో.. తెలంగాణ నిఘా వర్గాలు క్షేత్రస్థాయిలో జరిపిన దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. పొరుగు దేశాల నుంచి అక్రమ మార్గాల్లో సరిహద్దులు దాటి రాష్ట్రంలోకి ప్రవేశించిన విదేశీయుల సంఖ్య వేలల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com